# కష్టజీవులు

"ఒసేయ్ లమ్మి, ఇవిగో నలభై రూపాయలు. మనిష్టమే యిష్టము. ఏమం టావే ఓ నవ్వు నవ్వంటే—"

"ఏటి కొచ్చిన నవ్వు. మామ పొయ్యాడు చీరేంటో యెరగను, నీ తాగు డేంటో, నీ గొడవేమిటో తప్ప"

"అరె బిగ్గరగా అంటావే. కొంప మునుగుతుంది. ఎందుకొచ్చిన కోపం. నీకు పట్టుచీరె కొంటాగా"

"అయ్యో! నా మొగానికి పట్టుచీరె కూడ"

"పట్టుచీరె మొగా లంటూ వేరే వుంటాయేంటే. చూస్తూవుండు నా తడాఖా. మల్లప్పంటే ఏమనుకున్నావు"

"ఈ గంతులు యెందుకంట. కొన్ననాడు చెపుదు గాన్లే"

"కొనకేం లెక్క"

"సరేగాని. వినమంటే, రుక్కమ్మగారే యీ పండక్కి యింకారెండు రూపాయలు యెక్కిస్తుందంట"

"ఇంకేం మా బాగా వుంది"

"మరి ఏమిటనుకున్నా లమ్మంటే, యీ నెలనుంచి అరు రూపాయ లన్నమాట"

"చీరేమో ఎనిమిది పెటితేగాని రాదుగా మరెట్లా!"

"ఇదా నీ వుద్దేశం. నా దాంట్లో నేను దమ్మిడీ ఇయ్యను. కొంటే నీ డబ్బులోనే"

"అదిగాదే మాటకి చెప్పా. కొంటే నా డబ్బులోనేలే"

"పండక్కి అమ్మగారిచేతే కొనిపించుకుంటాలే, నువ్వేమీ తీసుకురా క్కర్లేదులే"

"అంత కోపంటే. నేనే తీసుకువస్తా లేవే. నువ్వూచూస్తున్నావుగద. నా వీపుమీద లేదుగద. ఎట్లాగంట బస్తాలు యీడ్చేది. ఈసారి నన్ను కొనుక్కోనీవే."

"ఓహో మహాబస్తాలు యీడ్చావులేవయ్యా, ప్రొద్దున్నే లేస్తా, సందేల దాక నడుములు విరిగిపోయేటట్టు పనిచేస్తానే నా మాటేమిటంట."

"ఎంతపనైనా ఇంట్లో కూలపడేగా. నే నవుతే ఫ్యాక్టరీకి పోవాలి. ఆ బస్తాలన్నీ అక్కడెయ్యాలి, మళ్ళీ బియ్యంబస్తాలు తీసుకురావాలి. మరి ఏమిటనుకున్నా."

"ఆహా! బావిదగ్గర చాద తోడేటప్పటికి తెలుస్తుంది. అయ్యగారు స్నానం చెయ్యాలి. ఆ బట్టలన్నీ గుంజాలి. అమ్మగారికి నీళ్ళు తోడాలి. చిన్నబాబులకు స్నానం చేయించాలి. నడుములు విరిగిపోతాయి వీటన్నింటికి నీళ్ళు తోడేటప్పటికి. నువ్వుచేసేది బస్తాలు మొయ్యటమేగా!"

"మాబాగా తెలును. కోటమీదనుంచి బస్తాలేచేటప్పటికి తెలుస్తుంది. పని. వీపు చిరిగిపోవాల్సిందే! పంతులుగారి మేడలేదు, అక్కడనుంచి ఫ్యాక్టరీకి తీసుకువాలి, ఏమనుకున్నావో!

"మహా చెప్పొచ్చావులేవయ్యా! నువ్వొక్కడివే ఏమిటి మరి నే నవుతే వక్కదాన్నేగా. ఇవన్నీ చెయ్యటంలా,"

"అవును అదవుతే నిజమే, మరి యెన్నిబస్తాలున్నా యనుకున్నావు. వక బస్తాఅనుకున్నావా! వీపు కాయలుకాని పోయిందంటే."

"నా నడుములు విరిగిపోతే లేదుగాని, అట్లా ఇట్లా చెప్పి చీరెకొనటం యెగేద్దామనా!"

"చీరె యింకొకసారి కొనుక్కుందుగానిలే. ముందర నా వీపుమీద గుడ్డలేకపోయె, బస్తాలుమోయటం యెట్లాగంట."

"ఇంకా నేను చెప్పేదేముంది నీ యిష్టమయ్యా. వక్క చీరె కొన మంటే యిదవుతావు. ఇంత చాకిరిచేస్తున్నా నీకు జాలిలేదు."

"కొంటాలేవే యిటు రా."

"అయ్యో చేతులు ముట్టుకోక, అబ్బ."

"ఏం, ఆఁ. ఇటురా. ఇవన్నీ యేమిటే!"

"ఏమి టేమిటి రోజూ చేసే పనేమి టనుకున్నావు, అయ్యోనెప్పంటే.'

"అందు కేనా చేతులు యిట్లా అయ్యాయి. మాట్లాడవే, లమ్మీ. నీకు నిజంగా చీరెకొంటానే. రోజూ యెంత బాధపడుతుండావో!"

"మరేంచెయ్యాలి. ఈ పండుగనుంచి రెండురూపాయలు యెక్కించె అట్లా వున్నావే."

"నిన్నుచూస్తె ఏదోవిధంగా వుందే, నిజంగా నువ్వన్నట్టు, నీ చాకిరి యెక్కువే, ఏమిటో అనుకున్నా. ఈసారి చీరే కొంటాలే."

"చీరె మాట చూసుకుందాం. ముందర లే. కంచంలో గంజిపోశా. నీళ్ళు పోసుకో తొందరగా."

"లేస్తా లేవే. ఎంత కాయకాసిందో నీ చెయ్యంతా ఎట్లా చేస్తున్నావో ఆ చాకిరీ అంతా."

"మరి ఏమిటనుకున్నా. అట్టా చెయ్యపట్టే, యింకా రెండు రూపా యలు వస్తున్నాయి యీ నెలనుంచి. లే."

"అమ్మగార్ని అడిగి కొంచెం నూనె తీసుకురావే యివ్వాళ తలకూడా దువ్వుకుంటా."

"నిన్నే కొంచెం తెచ్చా. ఇదిగో ఇక్కడే వుంది. వీపుమీదకూడా రాయనీవయ్యా, అయ్యో అట్లా ముందుకుపోతావేం. ఆ."

లమ్మి వేడిభాష్పాలు రెండు మల్లప్ప వీపుమీద అగ్నికణాలులాగ పడినాయి. మల్లప్ప వులిక్కిపడి వెనక్కు తిరిగాడు. లమ్మి గుడ్లనిండా నీళ్ళతో అతిదైన్యంగా మల్లప్ప వంక చూస్తోంది.

"ఎందుకు ఏడుస్తున్నావు చెప్పమంటే" అంటూ మల్లప్ప లమ్మి రెండు చేతులు గట్టిగా పట్టుకున్నాడు.

"వీపుమీద గుడ్డేకొనుముందర" అంటూ లమ్మి కూలబడింది.